క్లుప్తంగా

ఆనందరావు మాస్టారుకు ఎమ్మెల్యే నివాళి



ఆనందరావు మాస్టారు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: బొబ్బిలి ఏఎంసీ చైర్మన్, కూనాయవలస ఎంపీటీసీ బొమ్మి శ్రీనివాసరావు తండ్రి, విశ్రాంత ఉపాధ్యాయుడు బొమ్మి ఆనందరావు మాస్టారు మంగళవారం మధ్యాహ్నం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కూనాయవలస గ్రామం వెళ్లి, ఆనందరావు మాస్టారు పార్థివదేహంపై పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన మృతికి గల కారణాలను బాధిత కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు.

వేడుకగా శివపార్వతుల కల్యాణోత్సవం

బాడంగి: స్థానిక ఉమాసోమేశ్వరాలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం ఓ వేడుకలా నిర్వహించారు. ఆదివారం నుంచి మూడు రోజుల పాటు జరిగిన ఈ వేడుకల్లో తొలిరోజు కల్యాణం, సోమవారం సదశ్యం, మంగళవారం పుష్పోత్సవం చేపట్టారు. మంగళవారం మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం చేపట్టి, భక్తులకు స్వామి వారి అన్నప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు బి.నాగబాబు, ఆర్.సాయి చైతన్య, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

27 నుంచి గ్రామదేవత పండగ

బాడంగి: మండలంలోని డొంకినవలస గ్రామంలో ఈ నెల 27వ తేదీ నుంచి గ్రామదేవత(పైడితల్లి) పండగ నిర్వహిస్తున్నట్లు ఆ గ్రామపెద్దలు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుకల్లో తొలిరోజు తొలేళ్ల సంబరం, మరుసటి రోజు అంజలి రథోత్సవం, ఆఖరి రోజు అనుపోత్సవం నిర్వహిస్తామన్నారు. 27వ తేదీ రాత్రి రేలారే రేలా సినీ నృత్య ప్రదర్శనలు, 28వ తేదీన సత్యహరిశ్చంద్ర నాటకం వంటి కార్యక్రమాలు ఉన్నాయని తెలిపారు.

పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి



పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం సిటీ: పన్నుల బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం మంగళవారం నిర్వహించిన ఆయన.. 2023-24 ఏడాదికి సంబంధించి పెండింగ్‌లోని ఇంటి పన్నులు వసూలు చేయాలని, గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు, తాగునీటి ఎద్దడి నివారణ చర్యలు, చెత్త సంపద కేంద్రాల నిర్వహణ, క్లాప్ మిత్రల జీతాలు, సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవలపై దృష్టిసారించాలని తెలిపారు.


వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వన్నలిలో వైద్య శిబిరంలో వైద్యారోగ్య సిబ్బంది

రేగిడి: గ్రామాల్లో 104 అంబులెన్స్‌ల ద్వారా నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారులు అసిరినాయుడు, సోహినీరాఘవ్‌లు కోరారు. మండలంలోని చాటాయివలస, ఉప్పర్నాయుడువలస, వన్నలి గ్రామాల్లో వైద్య శిబిరాలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శిబిరాలకు హాజరైన రోగులకు ఆరోగ్య తనిఖీలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు.

పేపర్ క్రాఫ్ట్‌పై అవగాహన



పేపర్‌తో తయారు చేసిన కళాకృతులను ప్రదర్శిస్తున్న విద్యార్థులతో కొత్తవలస లైబ్రేరియన్ రామలక్ష్మి

కొత్తవలస/లక్కవరపుకోట: శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ఆకట్టుకుంటున్నాయి. కొత్తవలస,లక్కవరపుకోట మండల కేంద్రాల్లోని శాఖా గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న తరగతులకు విద్యార్థులు, చిన్నారులు ఉత్సాహంగా హాజరవుతున్నారు. మంగళవారం ఆయా గ్రంథాలయాల్లో చిన్నారులు, విద్యార్థులకు అల్లికలు,పేపర్ క్రాఫ్ట్‌పై లైబ్రేరియన్‌లు మీసాల రామలక్ష్మి, మేరీ కుమారి అవగాహన కల్పించారు. చిన్నారులు పేపర్‌తో తయారు చేసిన ఫ్లవర్స్, ఇతర కళాకృతులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సుమారు 60 మంది విద్యార్థులు హాజరయ్యారు.

నాడు-నేడు.. మారిన కళాశాలను చూడు..!



పూర్తిస్థాయి ఫర్నిచర్‌తో భౌతికశాస్త్రం ప్రయోగశాల

ఈ చిత్రంలో కనిపిస్తోంది.. బాడంగి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల. గతంలోని టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా చాలా అధ్వానంగా ఉండేది. పెచ్చులూడిన గచ్చులు, సరైన తలుపులు, కిటికీలు లేని తరగతి గదులు, అంతంతమాత్రంగా ఉండే మౌలిక సదుపాయాలు మాత్రమే కనిపించేవి. పరిసరాల్లో ఏ మూల చూసినా గోతులమయం, పిచ్చిమొక్కలతో దర్శనమిచ్చేవి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మనబడి నాడు-నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులకు సరికొత్త సొబగులు అద్దింది. దీంతో కార్పొరేట్‌కు దీటుగా ఇక్కడి కళాశాల తయారైంది. విద్యార్థులకు సౌకర్యవంతమైన కళాశాల భవనం అందించడం దగ్గర నుంచి మరుగుదొడ్లు, ఆర్‌వో వాటర్ ప్లాంట్, కళావేదిక ప్రాంగణం, సైకిల్ స్టాండ్ ఏర్పాటు చేశారు. వీటితో పాటు అన్ని తరగతి గదుల్లో కొత్త బెంచీలు, డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేశారు. పూర్తిస్థాయి ఫర్నిచర్‌తో ఫిజిక్స్, కెమిస్ట్రీ ల్యాబ్‌లను అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రస్తుతం మారిన కళాశాల రూపురేఖలు చూసి, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – బాడంగి



నాడు-నేడు పనులతో సరికొత్తగా తయారైన ప్రభుత్వ కళాశాల



డిజిటల్ తరగతుల కోసం ఏర్పాటు చేసిన తరగతి గది



విద్యార్థులు తాగేందుకు కళాశాలలో ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్



ఆధునిక నిర్మాణ శైలిలో మరుగుదొడ్లు



కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సైకిల్ స్టాండ్



అత్యంత సుందరంగా కళావేదిక ప్రాంగణం

ఎమ్మెల్సీ పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు

రేగిడి: మండలంలోని సోమరాజుపేట సర్పంచ్ సవలాపురపు రమేష్‌నాయుడును ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ మంగళవారం కలిసి పరామర్శించారు. సర్పంచ్ చిన్నాన్న జగన్నాథంనాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఆ గ్రామానికి వెళ్లి, జగన్నాథంనాయుడు మృతికి సంతాపం తెలిపి, బాధిత కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్సీ వెంట మాజీ ఎంపీటీసీ నర్సిమప్పారావు నాయుడు, వైస్ ఎంపీపీ వావిలపల్లి జగన్మోహనరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పుర్లి గోపాలకృష్ణ, లావేటి గణపతిరావు, లావేటి హరిబాబు, దేవాది సీతారాంనాయుడు, బోడసింగి నాగరాజు తదితరులు ఉన్నారు.

రాజాం: మున్సిపాలిటీ పరిధిలోని కాలెపు వీధికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దొంతంశెట్టి శ్రీనివాసరావును పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ మంగళవారం పరామర్శించారు. అనారోగ్యం కారణంగా హైదరాబాద్‌లో చికిత్స పొంది, ఇటీవల ఇంటికి చేరి కోలుకుంటున్న శ్రీనివాసరావును కలిసి ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, నాయకులు కాలెపు శేఖర్, బొమ్మన సూర్యనారాయణ, పిచ్చుక శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



రాజాం: శ్రీనివాసరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్

ఫారంపాండ్‌ల నిర్మాణంపై దృష్టి సారించాలి



రాజాం సిటీ: వీఆర్ అగ్రహారంలో వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీవో సాయిరాం



రాజాం: ఫారంపాండ్‌ల దరఖాస్తులపై ఆరాతీస్తున్న ఏపీడీ శ్రీనివాసరావు

రాజాం: ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా రైతులు తమ పంట పొలాల్లో ఫారంపాండ్‌ల నిర్మాణంపై దృష్టి సారించాలని పథకం ఏపీడీ మీసాల శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం పరిశీలించిన ఆయన.. వేతనదారులు రెండుపూటలా కొలతల ప్రకారం పనిచేస్తే రోజుకు రూ.300 చొప్పున గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందని తెలిపారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పలు గ్రామాల టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశమైన ఆయన గ్రామాల్లోని రైతులకు న్యూ స్ట్రాటజీ పనులపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఎకరం నుంచి మూడు ఎకరాల వరకు పొలాలు ఉన్న రైతులంతా మెట్టు పొలాల్లో ఫారంపాండ్‌లు తవ్వుకునేందుకు నిధులు కేటాయిస్తున్నామన్నారు. వీటి నిర్మాణాలకు రూ.50 వేలు వరకు నిధులు కూడా అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీవో కె.సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

రాజాం సిటీ: ఉపాధి హామీ పథకం పనులకు వెళ్తున్న వేతనదారులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఏపీవో కె.సాయిరాం సూచించారు. మండల పరిధిలోని అంతకాపల్లి, వీఆర్ అగ్రహారం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించి, పలు సూచనలు చేశారు. నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే రోజుకు రూ.260 నుంచి రూ.300 వరకు గిట్టుబాటు అయ్యే వేతనం వస్తుందన్నారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం



రాజాం: ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు పొలంలో దిగుబడులు పరిశీలిస్తున్న అధికారులు

రాజాం: నవధాన్యాల సాగుతో నేల సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ బి.రమాదేవి తెలిపారు. మండలంలోని బొమ్మినాయుడువలస గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై మంగళవారం అవగాహన కల్పించారు. రాయితీపై పంపిణీ చేస్తున్న నవధాన్యాలను ప్రతీ రైతు తీసుకుని, పొలాల్లో వేసుకోవాలని, మొక్కలైన తర్వాత వాటిని పొలాల్లోనే దున్ని వదిలేస్తే ఎరువుగా తయారవుతుందన్నారు. ఆ తర్వాత ఆర్‌టీవో హేమసుందర్, ఆర్‌టీఎల్ ప్రకాష్ తదితరులతో కలిసి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న పొన్నాడ పురుషోత్తం నాయుడు పంటపొలాలను ఆమె పరిశీలించి, మిగిలిన రైతులకు ఆ పొలాలు, వచ్చే ఫలసాయంను చూపించారు. తొలకరిజల్లు సమయంలోనే నవధాన్యాలు వేసుకుంటే నేలకు కావాల్సిన పోషకాలు లభిస్తాయన్నారు. ఎకరం పొలంలో 10 కిలోల నవధాన్యాలు వేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి: నవధాన్యాలు సాగు చేయడం ద్వారా భూసారం పెరిగి, అధిక దిగుబడులు వస్తాయని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జ్ జె.అప్పలనాయుడు అన్నారు. మండలంలోని మండాకురిటి, అగ్రహారం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. 30 రకాల విత్తనాలతో ఉన్న 10 కిలోల నవధాన్యాలను ఎకరా పొలంలో వేసుకుంటే ఆరోగ్యవంతమైన పంటతో పాటు అధిక దిగుబడులు వస్తాయన్నారు. అన్ని రైతు భరోసా కేంద్రాల్లో నవధాన్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీవో ఎస్.శివ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

తెర్లాం: క్రీడలతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని తెర్లాం-1, 2 సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్ జి.శ్రీరామ్, లైబ్రేరియన్ కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఖోఖో, కబడ్డీ ఆటలను విద్యార్థులతో ఆడించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. క్రీడల్లో రాణించిన ఎంతోమంది ఉన్నత స్థానాల్లో ఉన్నారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో నెమలాం హైస్కూల్ క్రాఫ్ట్, డ్రాయింగ్ ఉపాధ్యాయుడు విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే సమాచారం ఇవ్వండి

బాడంగి: గ్రామాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ ఆర్.జయంతి అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో మంగళవారం విలేకరులతో మాట్లాడిన ఆమె.. చోరీలు జరుగుతున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పనులకు వెళ్లినప్పుడు, ఊరు వెళ్లినప్పుడు ఇంటికి తాళాలు వేసి, వాటిని వెంట తీసుకుపోవాలన్నారు. డబ్బు, బంగారం, ఇతర విలువైన వస్తువులను బీరువాలో పెట్టి, వాటి తాళాలు ఇంట్లోనే ఉంచవద్దన్నారు. తెలియని వ్యక్తులను ఇంటికి ఆహ్వానించవద్దన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న పీహెచ్‌సీ వైద్యాధికారి తదితరులు

రేగిడి: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు అన్నారు. స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రతీ గ్రామంలోని యువత మొక్కలు నాటి సంరక్షించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. భూమిపై అడవుల శాతం తగ్గడం వల్లే ఉష్ణోగ్రతలు ఎక్కువవుతున్నాయని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ రమణ, ఫార్మసిస్ట్ ఎం.గోవిందనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధులు సోకకుండా టీకాలు



మెంటాడ: గేదె ఆరోగ్యం తనిఖీ చేస్తున్న డాక్టర్ బాలసందీప్

- మండల పశువైద్యాధికారి జె.నరేంద్రకుమార్

తెర్లాం: పశువులు, గొర్రెలు, మేకలకు జబ్బవాపు, చిటికె వ్యాధులు సోకకుండా వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నామని మండల పశువైద్యాధికారి డాక్టర్ జె.నరేంద్రకుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని లింగాపురం పంచాయతీ, అంట్లవార గ్రామంలో పశువులు, గొర్రెలకు టీకాలు వేసే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లోని అన్ని గ్రామాల్లో టీకాలు వేసే కార్యక్రమాన్ని గతకొన్ని రోజులుగా నిర్వహిస్తున్నామని, ఇప్పటికే 15 గ్రామాల్లో కార్యక్రమం పూర్తయ్యిందన్నారు.

మెంటాడ: మండలంలోని పెదమేడపల్లి గ్రామంలో పశుసంవర్ధక శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. 22 ఆవులకు గర్భకోశ చికిత్సలు, మరో 22 పశువులకు డిటింకింగ్, 18 లేగదూడలకు నట్టల నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో గరివిడి పశువైద్యాధికారి బి.శ్రీనివాసరావు, ఎస్.నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



తెర్లాంలో మేకలకు చిటికె వ్యాధి రాకుండా టీకాలు వేస్తున్న సిబ్బంది

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



రాజాం సిటీ: కంచరాంలో గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ మోహనరావు

రాజాం సిటీ:

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని రాజాం టౌన్ సీఐ డి.మోహనరావు హెచ్చరించారు. మండలంలోని కంచరాంలో గ్రామస్తులతో మంగళవారం సమావేశమైన ఆయన.. రాజకీయ పార్టీల పేరుతో ఎవరూ గొడవలు పడవద్దని, గెలుపోటములపై బెట్టింగ్‌లు కూడా వేయవద్దన్నారు. గ్రామపెద్దలు కూడా సంయమనం పాటించి, ఎటువంటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

సంతకవిటి: గ్రామాల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చూడాలని ఎస్‌ఐ షేక్ శంఖర్ అన్నారు. మండలంలోని మండాకురిటి, మామిడిపల్లి గ్రామాల్లో మంగళవారం పర్యటించిన ఆయన.. జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వెల్లడి కానున్న నేపథ్యంలో ఎటువంటి వివాదాస్పద వాఖ్యలు చేసుకోవద్దని, గొడవలు ఆడవద్దని ఆయన తెలిపారు.



సంతకవిటి: మండాకురిటిలో ప్రజలకు సూచనలిస్తున్న ఎస్‌ఐ షేక్ శంఖర్

అనుమానాస్పదంగా వివాహిత మృతి

విజయనగరం క్రైమ్: స్థానిక అలకానంద కాలనీలో నివాసం ఉంటున్న వివాహిత మంగళవారం ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కి ఉరివేసుకుని అనుమానాస్పద రీతిలో మృతిచెందింది. దీనికి సంబంధించి వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అందించిన వివరాలిలా ఉన్నాయి. గంట్యాడ మండలం మురపాక గ్రామానికి చెందిన పాటుపురెడ్డి వనిత (23) తన భర్త రాకోడు గ్రామానికి చెందిన రామారావుతో కలిసి అలకానంద కాలనీలో మూడు నెలలుగా నివాసం ఉంటోంది. భర్త సెంట్రింగ్ పనులకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి గదిలో అనుమానాస్పదరీతిలో సీలింగ్ ఫ్యాన్‌కి ఉరివేసుకుని మృతిచెందింది. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు పోలీసులకు సమాచారమిచ్చారు. వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి, విచారణ చేపట్టారు. మృతురాలి తండ్రి రామునాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్ల అందజేత



విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న హెచ్‌ఎం రమేష్ కుమార్

గజపతినగరం: పురిటిపెంట గ్రామ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసుకున్న ఒకేషనల్ విద్యార్థులకు హెచ్‌ఎం చిప్పాడ రమేష్ కుమార్ పాఠశాలలో మంగళవారం ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసుకున్న నలుగురు ఒకేషనల్ విద్యార్థినులకు ఈ సర్టిఫికెట్లు అందజేశామని చెప్పారు. ఒకేషనల్ విద్యార్థులకు ఉద్యోగవకాశాలు ఎక్కువగా ఉన్నా యని తెలిపారు. విద్యార్థులు ఇంటర్న్‌షిప్ విజయవంతంగా పూర్తి చేసేందుకు సహకరించిన కంప్యూటర్ ఉపాధ్యాయుడు కార్తీక్‌ను ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
బొబ్బిలి / రాజాం
9951602891, 9010133309
Office mail : vzmadvt@gmail.com